# కళ్ళు తెరు

సూర్యుడు నడినెత్తిన వెలిగిపోతున్నాడు. వడగాడ్పులు వీస్తున్నాయి.

రవికి ఆ రోజు సెలవు కావడంతో, వి.సి.పి. లో హిందీ సినిమా చూస్తున్నాడు. అతనితోపాటు భార్య యమున, కొడుకు కీర్తి కూడా సినిమా చూస్తూ ఆనందిస్తున్నారు. కీర్తి అయిదేళ్ళ వాడైనా సినిమాలంటే తెగ పిచ్చి. హిందీ తెలియకపోయినా మధ్య మధ్య ఆనందంతో చప్పట్లు కొడుతున్నాడు. వాడి ఆనందం చూసి తెగ మురిసిపోతున్నారా దంపతులు.

వీధి తలుపు తట్టిన శబ్దమయింది. యమున వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా మామగారు శంకరం.

"ఇంత ఆలస్యమయిం దేమిటి, మామయ్యగారు?" అంది యమున.

శంకరం ఉస్సురనుకుంటూ లోపలకొచ్చి ఫేను కిందున్న కుర్చీలో కూలబడ్డాడు.

"ఇల్లు కట్టించడమంటే మాటలతో పననుకుంటున్నావా, అమ్మాయ్? ఎంత ఓపికుండాలి? ఈ రోజుల్లో పని వాళ్ళతో మాట్లాడలేకపోతున్నాం. వాళ్ళతో అరిచీ అరిచీ ఇంతాలస్య మయింది" అన్నాడు శంకరం.

"కాళ్ళూ, చేతులూ కడుక్కు రండి, వడ్డించేస్తాను" అంటూ వంట గదికేసి నడిచింది యమున.

శంకరం లేచాడు,

రవి, తండ్రికేసి ఓసారి పరికించి చూశాడు. చామన ఛాయలో ఉన్న తండ్రి శరీరం ఎండకు ఒడిలిపోయినట్టుగా ఉంది. స్వేదంతో నిండిన ఆయన మొహం జిడ్డుకారి ఉన్నట్టుగా ఉంది.

"ఏమిటి, నాన్నా! ఎందుకీ ఎండలో వెళ్ళి రావడం? ఓసారి అద్దంలో చూసుకోండి, ఎలా ఉన్నారో తెలుస్తుంది" అన్నాడు రవి. అతని మాటల్లో కాస్తంత ఏవగింపు అస్పష్టంగా ధ్వనిస్తోంది.

శంకరం ఓ పొడి నవ్వు నవ్వేశాడు.

"ఒరేయ్, అబ్బాయ్! ఈపాటి శ్రమించకపోతే ఆ ఇల్లు త్వరగా పూర్తయ్యే దెట్లా చెప్పు? ఈ శ్రమ నాకు అలవాటయిపోయిందిరా" అన్నాడు సగర్వంగా.

"ఇప్పుడా ఇల్లు కట్టించకపోతే నేం? మనకొచ్చిన నష్ట మేమిటి, నాన్నా? ఇప్పటికే మూడు ఇళ్ళున్నాయి. మీకు సంతానం నే నొక్కణ్ణే! మనకి చాలవూ?"

"వీటి విలువ నీ కిప్పుడు తెలియదురా!" అని, కొడుకుతో వాగ్వివాదం ఇష్టం లేక బాత్రూమ్ వైపు జారుకున్నాడు శంకరం.

రవి భారంగా ఓ నిట్టూర్పు విడిచాడు. ధనార్జన యావ ఎవరికున్నా ఆ వ్యక్తికి సుఖమన్నది ఉండ దనడానికి తన తండ్రే దృష్టాంత మనుకున్నాడు రవి.

"లేకపోతే ఏవిటి? ఆయన హాయిగా కాలుమీద కాలేసుకుని, దర్జాగా తన శేష జీవితాన్ని గడిపేయగలడు - ఎవరి మీదా ఆధారపడకుండా అయినా సరే, అంతులేని ఈ శ్రమ ఎందుకు? అనుకున్నాడు.

శంకరం భోజనం ముగించి వచ్చాడు. అప్పటికింకా సినిమా చూస్తున్నాడు రవి, కీర్తీను.

భుక్తాయాసంతో సోఫాలో కూలబడ్డాడు శంకరం. రోజూ వీడియో సినిమాలు చూస్తూండటం వల్ల కరెంటు ఎంత ఖర్చవుతోందోనని ఓ ఆలోచన మెదడులో మెదిలేసరికి అతని గుండెలు గుభేలు మన్నాయి. సినిమాల కోసం ఇంత డబ్బు తగలేయడం వృథా అనిపించిం దతనికి.

"ఒరేయ్, అబ్బాయ్!" మెల్లగా అన్నాడు.

"ఏవిటి, నాన్నా?" రవి తండ్రికేసి చూశాడు.

అప్పుడే యమున వంట గదిలోనుంచివచ్చి ద్వారంవద్ద నుంచుంది. మావగారు ఏదో చెప్పడానికి ఉద్యుక్తు లవుతున్నారని గ్రహించింది.

"ఇలా వి. సి. పి. వేసుకుని సినిమాలు చూస్తూంటే కరెంటు ఖర్చు ఎంతవుతుందో ఆలోచించావా? ఎందుకీ వృథా ఖర్చు చెప్పు? అది కళ్ళకీ మంచిది కాదు. మీతోపాటు ఆ చిన్నవాణ్ణీ పాడు చేస్తున్నారు" అన్నాడు శంకరం.

యమున మొహం జేవురించింది. ఆమె కళ్లు ఎర్రగా చూస్తున్నాయి. భార్య పరిస్థితిని గ్రహించాడు రవి బద్దలవ్వడానికి సిద్ధంగా ఉన్న అగ్ని పర్వతంలా ఉందామె.

"ఎప్పుడో ఓ సారి వేసుకుంటున్నాం, నాన్నా! అయినా వి. సి. పి. ఇంట్లో ఉంచుకుని దేనికి – పూజించడానికా?" అన్నాడు రవి.

కొడుకు ఇలా సమాధానం చెప్పడం సుతరామూ నచ్చలేదు శంకరానికి. ఇంతకు మునుపు లేని చొరవ రవిలో ఇప్పుడిప్పుడే ఉత్పన్నమవుతూండడాన్ని అతను సహించలేకపోయాడు.

"ఊఁ, సమాధానం భేషుగ్గా ఉందిరా!" ఉడుకుమోత్తనంగా అన్నాడు శంకరం.

రవి మరేం మాట్లాడలేదు. సినిమా చూడటంలో లీనమయ్యాడు. అయితే యమున మాత్రం సహించలేకపోయింది మామగారి వ్యంగ్య ధోరణి. అయినా ఆమె కూడా సూటిగా చెప్పలేక, చరచరా నడచి టీ. వీ. ని కట్టేసింది.

"కట్టేశా వేమిటి, యమునా?" ఆశ్చర్యంగా అడిగాడు రవి.

"అనవసరంగా కరెంటు ఖర్చుబెట్టడ మెందుకండీ! వెళ్ళి హాయిగా రెస్టు తీసుకో కూడదూ?" అంది చుర చుర చూస్తూ.

భార్య స్పందనను అర్థం చేసుకోగలిగాడు రవి. కాని శంకరం వేరుగా అర్థం చేసుకున్నాడు. ఆమె తనను సమర్థిస్తోందని.

"బాగా చెప్పావమ్మా, యమునా! నా కోడలివనిపించుకున్నావు." మునిమునిగా నవ్వుతూ అన్నాడు శంకరం.

రవి రుస రుసలాడుతూ కొడుకు నెత్తుకుని, తన గదికేసి చరచరా నడిచాడు. అతని వెంట యమున కూడా వెళ్ళిపోయింది.

* * *

రోజులు గడుస్తున్నాయి.

ఆ రోజు ఆదివారం.

రెండో తారీఖు.

శంకరం సాధారణంగా నెలలో మొదటి వారం ఉదయం పూట ఇంట్లోనే ఉంటాడు. ఎందుకంటే, ఇళ్ళ అద్దెలు, వడ్డీ డబ్బులు ఇచ్చేవాళ్లు వచ్చేది ఆ రోజుల్లోనే. ఆ రోజు అందుకే ఇంట్లోనే ఉన్నాడు.

పార్వతి ఇంటద్దె తీసుకుని వచ్చింది.

"నమస్కారం, శంకరం గారూ!" అంది పార్వతి.

"నమస్కారం, కూచోవమ్మా!"

"ఎందుకు లెండి, సార్! ఇదిగో ఇంటి అద్దె, కరంటు ఛార్జీలూను. మొత్తం ఆరువందల యాభై, లెక్కపెట్టుకోండి" అంటూ కవరుతో అందించింది.

శంకరం ఆ డబ్బు లెక్కబెట్టుకున్నాడు.

"సరిపోయిందిలేవమ్మా! ఔనూ – మీ డిపార్టుమెంటు వాళ్లు నీకు క్వార్టరిస్తారేమో?" అన్నాడు శంకరం.

"ప్రస్తుతానికి ఖాళీ ల్లేవుటండీ! అయినా పిల్లల చదువులకు ఇబ్బందవుతుందండీ, అక్కడి నుంచి."

"ఓ చిన్న చిక్కొచ్చి పడిందమ్మా!"

"ఏమిటండీ?" ఆత్రంగా అడిగింది పార్వతి.

"మరేం లేదు. నా చిన్ననాటి స్నేహితు డొకడు ఈ మధ్యనే ఈ

ఊరు బదిలీ మీదొచ్చాడు. ఒకప్పుడు వాడు నాకెంతో సహాయం చేశాడు. వాడికి ఇల్లు కావాలన్నాడు. సరే, ఇస్తానని హామీ ఇచ్చానమ్మా! అందుచేత, మరేమీ అనుకోకుండా నువ్వు త్వరలో ఇల్లు ఖాళీ చెయ్యాలి" అన్నాడు శంకరం.

పార్వతి పక్కనే పిడుగు పడ్డట్టయింది. ఎంతగా చలించిపోయిందంటే – క్షణంపాటు ఆమె నోట మాట రాలేదు. విభ్రమంతో ఆయనకేసి చూస్తూ ఉండిపోయింది. భర్త పోయి ఇంకా సంవత్సరమైనా కాలేదు. వాళ్ళ డిపార్టుమెంటువారు కనికరించి తనకు ఉద్యోగం ఇచ్చారు కాబట్టి, పిల్లలతో ఎలాగో జీవితాన్ని ఈడ్చుకొస్తోంది. ప్రస్తుతం ఉంటున్న ఇల్లు విడిచి హఠాత్తుగా వెళ్ళిపొమ్మంటే ఎక్కడికి వెళ్తుంది? భగవంతుడు తనకింకా ఇలాంటి పరీక్షలు ఎందుకు పెడుతున్నాడో అర్థం కాలేదామెకు. ఆమె కళ్లు చెమ్మగిల్లాయి. పెదాలు వణుకుతున్నాయి.

"శంకరం గారూ! మీరు పెద్దవారు, పిల్లలు గలవాళ్ళు. నా పరిస్థితి తెలిసి కూడా మీ రిలా అనడం భావ్యంగా లేదండీ! అద్దె పెంచమంటే ఇటీవలే పెంచానుకూడా" అని పార్వతి ఇంకేమేమో చెప్పాలనుకుంటుంటే మధ్యలోనే అందుకున్నాడు శంకరం.

"అద్దె గురించి ఎవరు మాట్లాడా రమ్మా? నా ఇల్లు నాకు అవసరమంటున్నాను."

"ఇంత హఠాత్తుగా ఖాళీ చేయమంటే వేరే ఇల్లు ఎక్కడ దొరుకుతుందండీ?"

"అదంతా నాకు తెలియదమ్మా! నువ్వు ఖాళీ చేయాల్సిందే!" ఆర్డరు జారీ చేశాడు.

పార్వతి కంట తడి పెట్టుకుంది. ఆమెకు దుఃఖం వెల్లువలా పొంగుకొచ్చింది.

"శంకరం గారూ! మీకే కనుక ఓ కూతురుండి, ఇలా కంట తడి పెట్టుకుంటే మీ మనసు కరగదా? ఆడదాన్ని దైవోపహతురాల్ని నా కష్టాల్ని దృష్టిలో పెట్టుకుని కనికరించండి. ఇల్లు ఖాళీ చేయమనకండి. ఇది నా అభ్యర్థన" అంటూ వెక్కి వెక్కి ఏడుస్తూ వెళ్ళిపోయింది.

అంతా లోపలి వంట గదిలోంచి వింటున్నారు రవి, యమునా.

రవికి తండ్రి ప్రవర్తన అసహ్యం వేసినా, యమునకు ఒళ్ళు మండి పోయింది. ఒక స్త్రీగా పార్వతి కంట తడిని చూళ్ళేకపోయింది.

"మీ నాన్నగారి వ్యవహారం విన్నారు కదా! ఆయన చెప్పినదంతా అబద్ధమే. ఏ స్నేహితుడూ రావడం లేదు, పాడూ లేదు. అనాథలా ఉన్న పార్వతిచేత ఇల్లు ఖాళీ చేయిస్తే అద్దె పెంచి, అడ్వాన్సు పెంచి మరొకరికి ఇవ్వొచ్చు. అదండీ మీ నాన్న ప్లాను. ఇంత నీచపు ప్రవృత్తి గల మీ నాన్నను నా మావగారని చెప్పుకోవడానికే సిగ్గేస్తోందండీ! ఇలా ఎంతమందిని ఆయన ఏడిపిస్తున్నారో మనకేం తెలుసు? ఇతరులని కంట తడి పెట్టించి వాళ్ళ శాపనార్థాలతో గడించిన డబ్బు ఎవడిక్కావాలండీ! మొన్నటికి మొన్న మనం సినిమా చూస్తూంటే వి.సి.పి. గురించి ఏమేమో అన్నారు. జీవితాన్ని అనుభవించలేని డబ్బెందుకండీ?" అంది తీక్షణంగా భర్తకేసి చూస్తూ.

అబ్బాయి కీర్తి తల్లికేసి వింతగా చూస్తున్నాడు.

రవికి పౌరుషం వచ్చింది. యమున అన్నదాంట్లో నిజం లేకపోలే దనుకున్నాడు. ఒకరిని కష్టపెట్టి, కన్నీరు పెట్టించి వారి శాపనార్థాలకు గురవుతూ గడించిన డబ్బుతో ఏం సుఖపడతాం? తండ్రి గడించిన ఈ డబ్బంతా తనకే చెందుతుంది. అటువంటప్పుడు తామూ, తమ పిల్లలూ సుఖ జీవనం సాగించగలరా? వాళ్ళ కన్నీరు తమకు శాపాలు కావా? ఇలా ఆలోచిస్తుంటే అతని రక్తం వేడెక్కింది. విసురుగా తండ్రి ముందు కొచ్చాడు.

"ఆ పార్వతి వెక్కి వెక్కి ఏడుస్తూ వెళ్తోందేం నాన్నా?" సూటిగా ప్రశ్నించాడు.

శంకరం దిగ్భ్రాంతి చెందాడు. కొడుకు అలా ప్రశ్నించడం ఇదే ప్రథమం. అందుకే ఆ దిగ్భ్రాంతి.

"ఏముంది? మా స్నేహితు డొస్తున్నాడు. ఇల్లు ఖాళీ చెయ్య మన్నాను."

"నిజంగా మీ స్నేహితు డొస్తున్నాడా? ఎందుకీ అబద్ధాలు, నాన్నా? అబద్ధాలతో ఇంకెంతకాలం గడుపుతారు, నాన్నా?"

"అలా చెప్పకపోతే ఖాళీ చెయ్యదురా!"

"ఇప్పుడు ఖాళీ చేయించే అవసర మే మొచ్చింది?"

"అద్దె మరో యాభై అదనంగా వస్తుంది. అడ్వాన్స్ మరో రెండు వేలు తీసుకోవచ్చు. ఉన్న అవకాశాన్ని ఎందుకు వదులుకోవాలి?"

"మీ నాటకానికి ఆ పార్వతే దొరికిందా? మిగతా వాళ్ళని ఎందుకు ఖాళీ చేయించరూ? వాళ్ళయితే గడ్డి పెడతారని భయం. అంతేనా?"

"ఏమిట్రోయ్? ఇవాళ ఆశ్చర్యంగా మాట్లాడుతున్నావు?"

"మీ ప్రవర్తన ఆశ్చర్యాన్ని కలిగించింది."

"అందరూ చేస్తున్నదే నేనూ చేస్తున్నాను "

"ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోపోవడంవల్ల మీ వంటి వారి ఆటలు సాగుతున్నాయి. మిగతావాళ్ళ గురించి నేను మాట్లాడటం లేదు, నాన్నా! నేను మాట్లాడుతున్నది మీ గురించే."

శంకరం చిద్విలాసంగా నవ్వాడు.

"ఇన్ని అబద్ధాలాడుతూ, ఇంత శ్రమ పడుతూ సంపాదిస్తున్నది ఎవరి కోసమంటావు?" అన్నాడు ముసి ముసిగా నవ్వుకుంటూ.

"ఎవరి కోసమంటారూ?" తెలిసినా, తెలియనట్టే. వెటకారంగా ప్రశ్నించాడు రవి.

"ఇంకెవరి కోసంరా? మీ కోసమే! నా కింకెవరున్నారని?"

"రవికి యమున మాటలు గుర్తుకొచ్చాయి.

"ఇతరులను ఏడిపించి, వారి శాపనార్థాలకు గురవుతూ జీవితాన్ని అనుభవించకుండా, మరీ పిసినారిలా గడిస్తున్న మీ డబ్బు మా కవసరం లేదు, నాన్నా!" నిబ్బరంగా అన్నాడు రవి.

నివ్వెరపోయాడు శంకరం. 'ఏనాడూ పల్లెత్తుమాట ఎదురు చెప్పని కొడుకు ఇలా ప్రవర్తిస్తున్నాడేమిటి?' అనుకున్నాడు. అతనికేమీ అర్థం కాలేదు. "నీకేమైనా మతి పోయిందా ఏమిట్రా? ఇవాళ ఇలా మాట్లాడుతున్నావేంటి? ఇది నీకు కలిగిన బుద్ధి కాదు. ఎవరో నిన్ను ప్రోత్సహించారు. ఎవరది?" కయ్యిమన్నాడు శంకరం.

ద్వారం దగ్గరే నుంచున్న యమున ఇక నేపథ్యంలో ఉండదలుచుకోలేదు. విస విసా ముందుకొచ్చింది.

"ఆయన్ని ప్రోత్సహించింది నేనే, మామయ్యగారూ! నేనే ఆయన

కళ్ళు తెరిపించాను. ఆ పార్వతమ్మ ఎంత ప్రాధేయపడినా, విలపించినా మీ మనసు కరిగింది కాదు. మీది మానవ హృదయంలా లేదు. పాషాణ హృదయంలా ఉంది. ఇప్పుడు మనకు ఏం తక్కువని ఇలా ఎదుటి వాళ్ళను హింసించి, ఏడిపించి ధనార్జన చేస్తున్నారు? ప్రభుత్వం కళ్ళలో కారం కొట్టి కట్టాల్సిన ఆదాయపు పన్నుల్ని చాకచక్యంగా తప్పుడు లెక్కలు చూపుతూ ఎగ్గొట్టి, ఇంత సంపాదించి ఏం చేస్తారు? ఇంతవరకూ ఏ ఒక్కరి కృతజ్ఞత గాని, మంచి మాట గాని అందుకున్నారా మీరు? లేదే! మాకోసమే మీరింత నీచంగా, నికృష్టరీతుల్లో డబ్బు సంపాదిస్తుంటే, అటువంటి పాపిష్టి డబ్బు మాకొద్దు, మామయ్యగారూ! వాళ్ళ శాపనార్థాలు పిల్లలకు తగుల్తాయండి!" అంది యమున కాస్తంత ఆవేశంగానే.

శంకరం మొహం మ్లానమయింది. కోడలు తన గుండెల్లో ఎన్నాళ్ళ నుంచో దాచుకున్న భావాల్ని ఆ రోజు వ్యక్తం చేసిందని అర్థం చేసుకున్నాడు.

'తనకు తనవాళ్ళంటూ ఉన్న కొడుకూ, కోడలే అలా అభిప్రాయ పడితే, ఇక తాను చెమటోడ్చి, నిద్రాహారాలు మానుకుని ఎవరికోసం సంపాదించాలి? ఇంతమంది ఆగ్రహానికి, అశాంతికి, శాపనార్థాలకు గురై తానెందుకు సంపాదించాలి' అన్న ఆలోచన ఇప్పు డొచ్చింది శంకరానికి.

ఆ గదిలో నిశ్శబ్దం చోటు చేసుకుందా క్షణంలో. రవి, యమునల దృష్టి శంకరం వైపే ఉంది. శంకరం యమున చెంగు పట్టుకుని అయోమయంగా చూస్తున్న మనుమడు కీ రికేసి చూశాడు. వాడికివేమీ తెలియక పోయినా తనను మాత్రం వాడు ద్వేషించుకుంటాడేమో అన్న ఆలోచన వచ్చేసరికి శంకరం చలించిపోయాడు.

"అమ్మా, యమునా! నిజంగా నా కళ్ళు తెరిపించావమ్మా! డబ్బు మీది వ్యామోహం, యావ నాచేత ఎన్నో అక్రమాలు చేయించాయి. అవన్నీ తలుచుకుంటే ఇప్పుడు నాకే సిగ్గేస్తోంది. నువ్వడిగినట్టు ఈ డబ్బంతా ఎవరికోసం అని నేను ఏనాడూ నాలో నేను ప్రశ్నించుకోలే దమ్మా! నా దృష్టిలో ఆ డబ్బే ఉందిగాని, దాని వెనుక ఉన్న కన్నీరు, శాపనార్థాలను నేను గ్రహించలేకపోయాను. నా తప్పేమిటో నేను తెలుసుకున్నాను, మీరిద్దరూ నన్ను క్షమించండి" అన్నాడు పశ్చాత్తాపంతో.

"అంత మాట అనకండి, మామయ్యా! మీలో మార్పు వచ్చింది. అంతే చాలు" అంది చిరునవ్వుతో యమున.

"అవును, నాన్నా! నాకెంతో ఆనందంగా ఉంది" అన్నాడు రవి.

"అమ్మా, యమునా! పార్వతి దగ్గరకెళ్ళి చెప్పమ్మా, ఇల్లు ఖాళీ చేయ నవసరం లేదని."

"అలాగే మామయ్యా!" చిరునవ్వు నవ్వుకుంటూ అక్కడి నుంచి బయటకు నడిచింది యమున.

కీర్తి పరుగు పరుగున వచ్చి తాతయ్యను కౌగిలించుకున్నాడు. వాడేం అర్థం చేసుకున్నాడో శంకరానికి తెలిసింది కాదు. మనవడిని ముద్దులతో ముంచెత్తాడు.

రవి నవ్వుకుంటూ తాతా, మనవళ్ళని చూస్తున్నాడు.

* ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 29-5-1992 *